క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐలు



వై.సీతారామిరెడ్డిని కలిసిన ఎస్‌ఐ కె.గోపినాథ్

మంత్రాలయం : మంత్రాలయం ఎస్‌ఐ-2గా కె.గోపినాథ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కర్నూలు టూటౌన్ నుంచి బదిలీపై వచ్చారు. నూతన ఎస్‌ఐ టీటీడీ పాలక మండలి సభ్యుడు వై.సీతారామిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

మాధవరం ఎస్‌ఐగా జి.కృష్ణమూర్తి



మంత్రాలయం : మాధవరం పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా జి.కృష్ణమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ కిరణ్ బాబు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఆత్మకూరు పోలీస్ స్టేషన్ నుంచి కృష్ణమూర్తి ఇక్కడకు వచ్చారు. నూతన ఎస్‌ఐ మాట్లాడుతూ మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. చెక్ పోస్ట్ నుంచి అక్రమంగా కర్ణాటక మద్యం, నగదు తరలి రాకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

16న వాహనాల వేలం

ఆదోనిరూరల్: ఆదోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ అయిన వాహనాలకు వేలం పాట ఈనెల 16వ తేదీన ఉదయం 10 గంటలకు స్థానిక సెబ్ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు సెబ్ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పాటల్లో పాల్గొనే వారు స్థానిక సెబ్ కార్యాలయంలో లేదా 9440902578 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి

కౌతాళం:కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న తీరుకు నిరసనగా ఈనెల 16వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త బంద్‌కు అన్ని ప్రజలు సహకరించి జయప్రదం చేయాలని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు మల్లయ్య, జగదీష్, నాగేంద్ర, ఈరన్న పిలుపునిచ్చారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కరువు సహాయక చర్యలు చేపట్టాలని, పంటల బీమాను వెంటనే ఇవ్వాలని, బ్యాంకుల్లోనున్న రుణం నుంచి రూ.2లక్షలు మాఫీ చేయాలని, మూడు కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస మద్దతు ధర చట్టాన్ని అమలు చేయాలన్నారు పెట్రోల్, డిజల్, గ్యాస్ ధరలను పెంచేసి ప్రజలపై భారం వేసిందని మండిపడ్డారు.

ఆరోగ్య శ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ మాధవరెడ్డి

కోసిగి: నిరుపేదల ఆరోగ్య సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్యశ్రీ.. లబ్ధిదారులకు ఉపయోగపడేలా ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాలని ఎంపీడీఓ మాధవరెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఐదు సచివాలయాలను పరిశీలించి ఉద్యోగులు,వలంటీర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సర్వేలు చేసే విషయంలో జిల్లాలోనే పూర్తిగా వెనుకంజలో ఉన్నామన్నారు. మీకు కేటాయించిన ఇళ్లల్లో ప్రభుత్వ కార్యక్రమాల సర్వే ప్రక్రియలు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం కులగణన సర్వే వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. అలాగే ప్రతి ఇంటి దగ్గరకు వెళ్లి లబ్ధిదారుల మొబైల్‌లో ఆధార్ నంబర్‌తో ఆరోగ్యశ్రీ యాప్‌ను డైన్‌లోడ్ చేయాలన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేద్దాం



ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్‌ను సన్మానిస్తున్న 98 డీఎస్సీ ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: విద్యాభివృద్ధికి అందరూ కలసి కట్టుగా కృషి చేద్దామని మండల విద్యాధికారి-1 రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంఈఓను స్థానిక ఎమ్మార్సీ భవనంలో బుధవారం 98 డీఎస్సీ ఉపాధ్యాయ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు.

కిక్ బాక్సింగ్‌లో జిల్లాకు పతకాలు

కర్నూలు (టౌన్) : ఈనెల 7 నుంచి 11 వ తేదీ వరకు న్యూఢిల్లీలోని కేడీ జాదవ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన ఇరువురు బాలురు పతకాలు సాధించారు. ఈ విషయాన్ని కిక్ బాక్సింగ్ రాష్ట్ర కార్యదర్శి నరేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జశ్వంత్ రెడ్డి, గుర్రం కళ్యాణ్ కిక్, లైట్ ఈవెంట్లలో బంగారు పతకాలు సాధించారని వెల్లడించారు.

వేగంగా.. కచ్చితంగా!

- ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఫుల్లీ ఆటోమేటిక్ ఎనలైజర్ ఎక్సెల్-640 మిషన్ ఏర్పాటు
- దీని ద్వారా 640 రకాల రక్త పరీక్షలు
- పైసా ఖర్చు లేకుండానే రోగ నిర్ధారణ
- రోగులకు తప్పిన ఇబ్బందులు





ఫుల్లీ ఆటోమేటిక్ ఎనలైజర్ ఎక్స్ఎల్-640 మిషన్‌లో రక్త పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్, రక్త పరీక్ష కోసం క్యూలో కూర్చొన్న రోగులు

ఆదోని అర్బన్: ప్రజా ఆరోగ్యమే పరమావధిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మార్చేసింది. భవనాలను ఆధునీకరించడంతో పాటు అన్ని మౌలిక వసతులను కల్పించింది. అలాగే అధునాతన పరికరాలు, మిషన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ఆదోని ఏరియా ఆసుపత్రికి రక్త పరీక్షల కోసం రూ.20 లక్షల వ్యయంతో అత్యంత ఆధునిక యంత్రం ఫుల్లీ ఆటోమేటిక్ అనలైజర్ ఎక్సెల్ 640 మిషన్‌ను సమకూర్చింది. ఈ మిషన్ ద్వారా రక్త పరీక్షలను వేగంగా, కచ్చితంగా నిర్వహించి ఫలితాలను అందజేస్తున్నారు.

ఏఏ రకాల పరీక్షలంటే..

ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఫుల్లీ ఆటోమేటిక్ ఎనలైజర్ ఎక్సెల్-640 మిషన్ ద్వారా కిడ్నీ, లీవర్, షుగర్, బీపీ, హెచ్‌బీ, సోడియం, పొటాషియం, క్యాల్షియం, కొలెస్ట్రాల్, ప్లేట్‌లైట్లు, హెచ్‌బీఏ1సీ, పెరాలసిస్, స్నేక్ బైట్ వారికి విషం ఎక్కిందా లేదా తదితర పరీక్షలు చేస్తారు. ఇలాంటి ఖరీదైన పరీక్షలను సైతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా చేస్తున్నారు. ఇది పేద రోగులకు ఊరట కల్పిస్తోంది.

గతంలో ప్రైవేటు ల్యాబుల్లోనే..

టీడీపీ పాలనలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ల్యాబ్‌ల నిర్వహణ అధ్వానంగా ఉండేది. దీంతో ఆస్పత్రులకు వచ్చే రోగులు, గర్భిణులు రక్త పరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చు చేసుకోవాల్సి వచ్చేది. ఒక కార్డియాలజీ (గుండె) టెస్టుకు రూ.2500, పెరాలసిస్, స్నేక్‌బైట్, బ్లడ్ కాట్ కోసం రూ.1000, హెచ్‌బీఏ1సీకి రూ.600, సీకేఎండీ రక్త పరీక్షకు రూ.1000 తదితర పరీక్షలకు వందలు వేలల్లో వెచ్చించాల్సి ఉండేది. ఇలాంటి భారం ఉండకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 640 రకాల రక్త నిర్ధారణ పరీక్షల కోసం యంత్రాలను ఏర్పాటు చేసి, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ఉచితంగా రక్త పరీక్షలను చేస్తుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

రోజుకు 70 నుంచి 100 మందికి పరీక్షలు

స్థానిక ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి ప్రతిరోజూ 500 నుంచి 600 మంది ఓపీలు వస్తాయి. ఇందులో 70 నుంచి 100 మందికిపైగా రక్త నిర్ధారణ పరీక్షల కోసం వస్తుంటారు. ప్రతిరోజూ 700 రకాల టెస్టులు రక్త పరీక్షలు చేస్తారు. గంటకు 640 టెస్టులను ఈ మిషన్ ద్వారా చేయవచ్చు. వచ్చిన వారందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపకుండా వేగంగా స్థానికంగానే పరీక్షలు నిర్వహించి రిపోర్టును అందజేస్తున్నారు.

మూడు నెలల క్రితం షుగర్ ఎంత ఉందో తెలుసుకోవచ్చు



ఎక్సెల్-640 మిషన్ వల్ల గత మూడు నెలల క్రితం షుగర్ ఎంత ఉంది అనేది కూడా తెలుసుకోవచ్చు. అలాంటి అధునాతన పరికరం ఇది. కచ్చితంగా, వేగంగా ఫలితాలు ఇస్తుంది.

- సుధాకర్, వైద్యులు (ఫోటో నం. 12ఈ)

అన్నిరకాల వ్యాధుల నిర్ధారణ చేస్తుంది



ఈ మిషన్ ద్వారా అన్ని రకాలైన గుండెజబ్బు, షుగర్, బీపీ, టీబీ, కిడ్నీ తదితర 640 వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేసుకోవచ్చు. బయట రక్త పరీక్షల కోసం వేల రూపాయలు ఖర్చు చేసుకోకుండా ఏరియా ఆస్పత్రిలోనే ఉచితంగా చేసుకోవచ్చు. ఫలుతాలు కచ్చితంగా వస్తాయి

- నసీరున్, వైద్యురాలు

రోజుకు వంద మందికి రక్త పరీక్షలు

ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల రోగులకు ఫుల్లీ ఆటోమేటిక్ ఎనలైజర్ ఎక్స్ఎల్-640 మిషన్ ద్వారా రక్త నిర్ధారణ పరీక్షలు చేసే సౌకర్యం ఉంది. ప్రతిరోజూ 70 నుంచి 100 మంది వరకు రక్త పరీక్షల కోసం వస్తున్నారు. వారికి పైసా ఖర్చు లేకుండా ఉచితంగా, వేగంగా కచ్చితంగా పరీక్షలు చేస్తున్నాం.

- అనిత, సీనియర్ ల్యాబ్‌టెక్నీషియన్

టీబీ డ్యాంలో 9.379 టీఎంసీల నీటి నిల్వ



తుంగభద్ర జలాశయం

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర ఉమ్మడి జలాశయంలో బుధవారం 9.379 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాంలో నీటి చేరిక (ఇన్‌ఫ్లో) నిలిచిపోగా, అవుట్‌ఫ్లో 163 క్యూసెక్కులుంది. నీటిమట్టం 1587.92 అడుగుల మేర ఉంది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో నీటిమట్టం 1611.56 అడుగుల వద్ద 40.742 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ఇదిలా ఉండగా తాగునీటి అవసరాల నిమిత్తం ఎల్లెల్సీకి ఆంధ్ర, కర్ణాటక కోటా నీటిని ఈ వారంలో వదిలే అవకాశాలున్నాయని బోర్డు అధికారులు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



జిట్టా అజయ్ కుమార్

మద్దికెర: మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన జిట్టా ఆంజనేయులు, సుశీలమ్మ దంపతుల కుమారుడు జిట్టా అజయ్‌కుమార్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు సూపర్‌సెవెన్ జిల్లా కార్యదర్శి భాస్కర్ బుధవారం తెలిపారు. ఈ నెల 10, 11 తేదీలలో మద్దికెరలో జరిగిన రాష్ట్రస్థాయి సూపర్ సెవెన్ క్రికెట్ పోటీలలో రెండు ఓవర్లు బౌలింగ్ చేసి రెండు వికెట్లు కూల్చడమేగాక కేవలం 4 పరుగులు ఇచ్చి ప్రత్యర్థిని కట్టడి చేశారని, అలాగే బ్యాటింగ్ 14 బంతుల్లో 54 పరుగులు చేసి సత్తా చాటడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలి



సరస్వతి పూజ చేసిన విద్యార్థులు, అధ్యాపకులు

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థి ఉన్నత ఎదగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వసంతపంచమిని పురస్కరించుకొని సరస్వతి దేవికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వారు మాట్లాడుతూ వసంత పంచమి రోజు సరస్వతి దేవిని స్మరించుకోవడం మంచి శుభపరిణామమన్నారు. స్థానిక ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి సహకారంతో, దాతల ద్వారా రూ.5,50,000లతో కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్ఎంఎం కళాశాల బాటనీ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు నీరజ అధ్వర్యంలో కళాశాలలో కొత్తగా బాటనీ ల్యాబ్‌ను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా బాటనీ అధ్యాపకురాలు నీరజను అభినందించారు.

ఘనంగా ప్రతిష్ఠాపన వేడుకలు



ప్రత్యేక అలంకరణలో అశ్వర్థ లక్ష్మీనారాయణస్వామి



ప్రతిష్ఠించిన నవగ్రహాలకు పూజలు చేస్తున్న పండితులు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో వెలిసిన శ్రీ అశ్వర్థనారాయణ ఆలయంలో ప్రతిష్ఠాపన వేడుకలు బుధవారం ముగిశాయి. ఆలయకమిటీ ఆధ్వర్యంలో శ్రీ మహాగణపతి, సతీసమేత ఆదిత్యాది నవగ్రహ, నాగదేవతలు, శిఖరకలశ ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. శ్రీ అశ్వర్థ లక్ష్మీనారాయణ స్వాములకు ప్రత్యేక పూజలు, అలంకారం నిర్వహించారు. అనంతరం శేష, రక్ష, ప్రతిష్ఠాంగ హోమాలు నిర్వహించారు. యంత్ర ప్రతిష్ఠ, విగ్రహాల ప్రతిష్ఠాపనము, శిఖర కలశ ప్రతిష్ఠాపనము, ప్రాణప్రతిష్ఠ, గోపూజ, బలిపూర్ణాహుతి, మహామంగళహారతి తదితర పూజలు జరిగాయి. అనంతరం వీహెచ్‌పీ పీఠాధిపతులతో సభ నిర్వహించారు.

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి



దామోదరం సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



దామోదర సంజీవయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదోనిటౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని బుధవారం ఆదోనిలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాస్, వైస్ చైర్మన్ నరసింహులు, ఎస్సీ సెల్ పట్టణాధ్యక్షుడు చలపతి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి, కేంద్ర కార్మికశాఖ మంత్రి, రాజ్యసభ సభ్యుడు, ఆల్ ఇండియా కాంగ్రెస్ అధ్యక్షుడిగానూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను రాజకీయంగా చైతన్యపరిచిన నేత దామోదరం అని కొనియాడారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కుంకనూరు వీరేష్, నరేష్, హరి, మణి, సురేష్, చిన్న, తిమ్మప్ప, రామకృష్ణ, తాయన్న తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిరూరల్: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను బుధవారం స్థానిక సంజీవయ్య కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ మాజీ మెంబర్ ఆర్‌దేవి ప్రసాద్ ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు మాజీ కౌన్సిలర్ లక్ష్మన్న, కేశవ మాస్టర్, బొబ్బిలి కల్లుపోతుల రఘు, యాపమాను వీరేష్, కల్లుపోతుల రవి తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు సమర్థవంతంగా పనిచేయాలి

ఆలూరు రూరల్: బూత్ లెవల్ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ఆలూరు అసెంబ్లీ అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఆయన ఆలూరులోని 132 పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఓటర్లు అన్ని సౌకర్యాల మధ్య ఓటు హక్కు వినియోగించుకునేలా వసతులు కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ర్యాంపులు, వికలాంగులకు వీల్ చైర్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. బీఎల్‌ఓలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన మౌలిక వసతులపై నివేదిక తయారు చేసి ఆర్వోకు అందించాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులను ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయించాలన్నారు.

ఈ-శ్రమ్ కార్డుతో కార్మికులకు భరోసా

ఆలూరు రూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ కార్డులతో అసంఘటిత కార్మికులకు భరోసా లభిస్తోందని ఆలూరు కార్మిక శాఖ అధికారిణి కనక లక్ష్మి అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు, వలస కార్మికులు, చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, టైలరింగ్, చేతి వృత్తులు, తోపుడు బండ్ల వారు, వీధి వ్యాపారులు, పాల వ్యాపారులు, ఇళ్లలో పనిచేసే పని మనుషులు, క్షురకులు, పండ్ల విక్రేతలు తదితర వృత్తుల వారందరూ ఈ-శ్రమ్ కార్డుకు నమోదు చేసుకోవాలన్నారు. ఆలూరు నియోజకవర్గంలో 1,45,884 మంది కార్మికులు ఉన్నారని, ఇప్పటివరకు 78,895 మంది ఈ-శ్రమ్ కార్డులు పొందినట్లు చెప్పారు. 67,289 మంది కార్మికులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. ఈ-శ్రమ్ పోర్టల్ పేర్లు చేసుకున్న కార్మికులకు సామాజిక భద్రతతో పాటు వివిధ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబానికి రూ.2 లక్షలు బీమా, అంగవైకల్యం పొందితే రూ.1 లక్ష సాయం అందుతుందన్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య



అయ్యప్ప (ఫైల్)

కౌతాళం: మండలంలోని బదినేహాల్ గ్రామంలో అప్పుల బాధతో రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మాల అయ్యప్పకు (53) నాల్గు ఎకరాల సొంత పొలం ఉంది. వ్యవసాయం చేసుకుని జీవిస్తున్న అయ్యప్పకు నాల్గు సంవత్సరాల నుంచి సరైన పంట దిగుబడి రాకపోవడంతో రూ.3 లక్షలకు పైగా అప్పులయ్యాయి. రుణదాతలకు సమాధానం చెప్పుకోలేక మనస్థాపంతో మంగళవారం రాత్రి ఇంట్లో పురుగుమందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య రత్నమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న సీఓ మల్లికార్జున

ఆదోని టౌన్: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని డాక్టర్ హర్షిక, డాక్టర్ గాయిత్రి, డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ సైనాజి బేగం పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లో పల్స్ పోలియో కార్యక్రమం కార్యాచరణపై సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ మార్చి 3వ తేదీ నుంచి నాలుగు, ఐదో తేదీల్లో పల్స్ పోలియో కార్యక్రమం ఉంటుందన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ మొదలుకొని ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు మేరీ సిస్టర్, జ్ఞానేశ్వరి సిస్టర్, సీఓలు మల్లికార్జున, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓలు సువర్ణల సునియం, రామ్మూర్తి

పెద్దకడబూరు: ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలని ఎంఈఓలు సువర్ణల సునియం, రామ్మూర్తి సూచించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం మండలంలోని హెచ్. మురవణి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు, బోధన విధానాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుల లెసన్‌ప్లాన్స్, టీచర్స్ డైరీలను తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించి వారిని తీర్చిదిద్దాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. వంట నాణ్యంగా ఉండేలా చూసుకోవాలని ఏజేన్సీ సభ్యులకు సూచించారు.

విద్యుత్ ఏఈపై చర్యలు తీసుకోండి

పెద్దకడబూరు : మండలంలో విద్యుత్ సమస్యలను పట్టించుకోని ఏఈ సుబ్బారెడ్డిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మబ్బు ఆంజనేయ డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ సమీపంలోని వాల్మీకి విగ్రహం దగ్గర సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం ఏఈపై చర్యలు తీసుకోవాలని ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఏఈ స్థానికంగా ఉండకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నడని మండిపడ్డారు. రాత్రి సమయాల్లో గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలిగితే సరిచేసే వారే కరువయ్యారని వాపోయారు. బోర్ల బావులకు విద్యుత్ సరఫరా కోసం రైతుల దగ్గర డబ్బులు వసూలు చేసిన సంఘటనలు చాలా ఉన్నాయని ఆరోపించారు. చిన్నకడబూరు గ్రామంలో ఆపరేటర్ మునెప్ప గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు, రైతులు తిక్కన్న, హనుమంతు, నాగరాజు, దస్తగిరి, వీరేష్, రామాంజి పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలం

- ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులతో కలెక్టర్



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): జీఓ నంబర్ 535లోని నిబంధనల ప్రకారం అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులకు హామీ ఇచ్చారు. బుధవారం ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటిస్థలం ఇవ్వాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్ అక్కడికే సమాచార శాఖ డీడీ జయమ్మను పంపి అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఆమెతో చెప్పించారు. అనంతరం ఆ అసోసియేషన్ నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వగా 535 జీఓ ప్రకారం అర్హులకు న్యాయం చేస్తామని, జాబితాను మరోసారి పరిశీలించాలని తహసీల్దార్లను ఆదేశించినట్లు చెప్పారు. ఐదేళ్ల అనుభవం కలిగిన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలం కేటాయించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్ర కోరారు.

వైభవంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట



దైవందిన్నెలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామ బస్‌స్టాప్ సమీపంలో బుధవారం వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం కనులపండువగా జరిగింది. విగ్రహానికి పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం జనసమూహం, జై వాల్మీకి మహర్షి నినాదాల మధ్య విగ్రహావిష్కరణ చేపట్టారు. గ్రామ పెద్దలు, నాయకులు జానకిరామిరెడ్డి, వాల్మీకి విగ్రహ కమిటీ నాయకులు బోయ గోకారి, రంగన్న, తిప్పన్న, చిన్న అంజనేయ, నాగేష్, రామలింగడు, కృష్ణ, తలారి మహేష్, పుండుకూర నరసింహులు, బజారి, బొడ్డన్న, నరసింహులు, బుడ్డ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రామాయణ మహాకావ్యం రచించిన వాల్మీకి మహర్షిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విగ్రహ మహోత్సవ కార్యక్రమానికి గ్రామస్తులే గాకా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వాల్మీకులు తరలివచ్చారు. వాల్మీకి సంఘం నాయకులు డాక్టర్ పార్థసారథి, గుడిసె కృష్ణమ్మ, మాధవరం రాఘవేంద్ర రెడ్డి, వీజీఆర్ కొండయ్య, రంగముని, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

ఆదోనిరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ, వ్యవసాయ కార్మిక, ప్రజా వ్యతిరేక మతతత్వ రాజకీయాలకు నిరసనగా ఈనెల 16న తలపెట్టిన దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక రెవెన్యూ భవన్‌లో ఐఎఫ్‌టీయూ నాయకులు వెంకప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.అజయ్‌బాబు, ఐఎన్‌టీయూసీ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు మల్లికార్జున మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఈ గ్రామీణబంద్‌లో పాల్గొనాలన్నారు. సమావేశంలో నాయకులు లింగన్న, యల్లప్ప, గంగన్న, అఖండ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

20న మండల సర్వసభ్య సమావేశం

కోసిగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 20వ తేదీన ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ మాధవ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై చర్చ ఉంటుందన్నారు. అని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు. ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.